తాగునీటి కోసం అవస్థలు

గొంతెండుతున్న డబుల్‌బెడ్‌రూం, ఎస్సీ కాలనీవాసులు

నీళ్లు తోడుతున్న అంజమ్మ

ఖాళీ బిందెలతో డబుల్‌బెడ్‌రూం కాలనీవాసులు

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 24: దుమ్ముగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు మిషన్ భగీరథ నీరు అందక కాలనీవాసులు, ఎస్సీ కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వేసవికి ముందు నుంచే మిషన్ భగీరథ పథకం చేపట్టి మహిళలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చేశారని, వేసవి రాక ముందే మంచినీటికి అప్పుడే గొంతెండే పరిస్థితి ఏర్పడిందని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పుడే మూడు బిందెలకు మించి నీరు రావడంలేదని, మంచినీటి సరఫరా సక్రమంగా కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై మిషన్ భగీరథ ఇంట్రా ఏఈ ఉపేందర్‌ను 'నమస్తే' వివరణ కోరగా సమస్య తమ దృష్టికి రావడంతో గతంలో పైపులైను వేయించినప్పటికీ మంచినీరు సక్రమంగా రావడం లేదని, ఆ గ్రామంలో ముందుగానే ఇళ్లకు ఎక్కువగా మంచినీటి సరఫరా జరగడంతో చివరి ఇళ్లకు నీటి సరఫరా జరగడంలేదని, దీనిపై పంచాయతీ కార్యదర్శికి తెలిపామని, త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. బోరు వేసినప్పటికీ గ్రౌండ్ వాటర్ లెవలింగ్ లేకపోవడంతో నీరు రావడంలేదని సమాధానమిచ్చారు.

నీరురాక ఇబ్బందులు పడుతున్నాం

కొన్ని రోజులుగా తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నాం. ఇటీవల పైపులైను వేసినప్పటికీ ఇళ్ల సముదాయంలో చివరన ఉన్న మాకు నీరు రావడం లేదు. ఈ విషయాన్ని అధికారులకు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నాం. పైపులైనులో వాటర్ రాకపోవడంతో వచ్చే అరకొర నీటిని భూమిలో నుంచి తోడుకోవాల్సి వస్తుంది.

– అంజమ్మ, డబుల్ బెడ్‌రూం కాలనీవాసి, దుమ్ముగూడెం

బయటి నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి

ప్రతిరోజూ పనులకు వెళుతున్నాం. నీటి కోసం బిందెలు చంకన పెట్టుకొని బయటకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నాం. రోజూ పనులకు వెళ్తే తప్ప పూట గడవదు. నీటి కోసం పనులు మానుకోవాల్సి వస్తోంది. అధికారులు తాగునీటిని అందించేలా చూడాలి.

– గాయత్రీ, డబుల్‌బెడ్‌రూం కాలనీవాసి, దుమ్ముగూడెం

ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్సీతో బోధన : కలెక్టర్

ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్సీని పరిశీలిస్తున్న కలెక్టర్

భద్రాచలం, ఫిబ్రవరి 24: ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్సీతో విద్యాబోధన చేపట్టేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సోమవారం పట్టణంలోని తాతగుడి సెంటర్‌లో మండల ప్రాథమిక పాఠశాలలో ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో విద్యాబోధన జరగాలని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కంప్యూటర్ విద్య కూడా అంతే అవసరమని, స్కూల్ నుంచి ఇంటికి వచ్చినప్పుడు ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల పర్యవేక్షణలో ఇంటి వద్ద కూడా చదివేలా బాధ్యతను తల్లిదండ్రులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వరచారి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంఈవో రమ, పాఠశాల హెచ్‌ఎం, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖనిజోత్పత్తిలో తెలంగాణ కీలకం

మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరి 24: దేశంలో కీలక ఖనిజాల ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం ప్రధాన భూమిక పోషిస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో సోమవారం క్వీన్స్ ల్యాండ్ ఆస్ట్రేలియా రాష్ట్ర ఆర్థిక, వాణిజ్య, ఉపాధి శిక్షణ శాఖల మంత్రి రోస్ బేట్స్, ఆ రాష్ట్ర అధికారుల బృందంతో సమావేశమయ్యారు. కీలక ఖనిజాల ఉత్పత్తి, వ్యాపార విస్తరణ అవకాశాలపై మాట్లాడారు. విద్యుత్ వాహనాలకు, సోలార్ విద్యుత్తుకు, బ్యాటరీ స్టోరేజీకి మన దేశంలో మంచి డిమాండ్ ఉందన్నారు. ఈ రంగాలకు 11 రకాల ముడి ఖనిజాలు ఎంతో కీలకమైనవని అన్నారు. వీటిని ఇప్పటి వరకు విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని అన్నారు. వీటి లభ్యత క్వీన్స్ ల్యాండ్‌లో అధికంగా ఉందని చెప్పారు. పరస్పరం లబ్ధి చేకూరేలా వీటి ఉత్పత్తి–విక్రయ వ్యాపార ఒప్పందంపై ప్రాథమికంగా అవగాహనకు వచ్చినట్లు వివరించారు.

రైతులపై 'జప్తు' దాడులను ఊరుకోం

మాట్లాడుతున్న అన్నవరపు సత్యనారాయణ

ములకలపల్లి, ఫిబ్రవరి 24: రుణాల జప్తుల పేరిట రైతుల ఇండ్లపై బ్యాంక్ అధికారులు దాడులకు దిగితే చూస్తూ ఊరుకోబోమని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ హెచ్చరించారు. ఆయన సోమవారం ములకలపల్లిలో తెలంగాణ రైతు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గత ఏడాది రైతుల ఇండ్లలోకి డీసీసీబీ అధికారులు చొరబడి.. రుణాల జప్తుల పేరుతో సామాన్లు, టీవీలు, మంచాలు, పరుపులు తదితర సామగ్రిని తీసుకెళ్లారని చెప్పారు. ఆ అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇకపై ఇటువంటి వాటిని సహించేది లేదని, ప్రతిఘటన ఉంటుందని హెచ్చరించారు. బోనస్ ఇస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం మొండి చేయి చూపించి, రైతులను మోసగించిందని విమర్శించారు. రెండు లక్షల లోపు రుణ మాఫీ హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు ఊకంటి రవికుమార్, వర్సా శ్రీరాములు, గోపగాని లక్ష్మీనర్సయ్య, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఈ-ఫైలింగ్‌పై శిక్షణ

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 24: 'ఈ–ఫైలింగ్ 3.0'పై జిల్లాలో సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని శిక్షకులు ముప్పు రవీంద్రారెడ్డి, సాముల రోహిత్‌రెడ్డి నిర్వహించారు. ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు పాటిల్ వసంత్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి, న్యాయమూర్తులు బత్తుల రామారావు, సుచరిత, సాయిశ్రీ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు తోట మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/S Shriram Finance Ltd, **KOTHAGUDEM** Branch Rep. by its Branch Manager it is stated that Smt. **CHINTHALA KALYANI** W/o. Spandan, **Aged : 30**Years, **R/o.** H.No. 1-47/A, Garibpeta Village, Kothagudem, Bhadradri Kothagudem District is creating mortgage against her property shown below as security for the proposed trade Loan. If anybody having any objection they can send the objections to me or to my client within **3** days from the date of publication of this notice and further objections if any shall not bind my client.

SHEDULE OF THE PROPERTY

RCC house bearing H.No.8-58/1, with a plinth area of 380.58 Sq.Feet & ACC roofed house with a plinth area of 148.50 Sq.feet in the house site of an extent of 174.94 Sq.yards of 146.27 Sq.meters situated within Gramapanchayath limits at Gowthampuram, Burgampad Town and Mandal, Bhadradri Kothagudem District, SRO Limits of Burgampad, bounded by: **EAST:** Gramapanchayath Road, **WEST:** House of M. Ramanaiah, **NORTH:** R & B Road, **SOUTH :** House of K Abbaiah.

PALIVELA GANESH BABU
Advocate, Kothagudem, Bhadradri Kothagudem Dist.,Cell:9849246278
Kothagudem Dt :23.02.2025

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

CHANGE OF NAME

I, **REDDIMALLA UPENDAR** (OLD NAME) S/o. **NAGESWARA RAO** R/O.H.No.1-34, Chegomma Village, Main Road, Kusumanchi Mandal, Khammam Dist. Hereby changed my name as **REDDYMALLA UPENDER** (NEW NAME) S/o. **NAGESWARA RAO** for all purposes.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

23న కొత్తగూడెంలో ఆరోగ్య మహాసభ

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 24: వచ్చే నెల 23న కొత్తగూడెంలో ప్రకృతి, ఆరోగ్య మహాసభ నిర్వహించాలని సోమవారం స్థానిక స్వర్ణభారతి పాఠశాలలో జరిగిన ప్రకృతి ఆశ్రమం కమిటీ సమావేశం నిర్ణయించింది. గౌరవాధ్యక్షుడు మొక్కల వెంకటయ్య, సింగరేణి ఏజీఎం గోనె శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఆశ్రమం ఆధ్వర్యంలో గత పదేళ్లుగా యోగా మహాసభలు, మిల్లెట్స్ ఫెస్టివల్, మిల్లెట్స్‌తో వంద రకాల వంటకాలు, ఔషధ మొక్కల ప్రదర్శన, డాక్టర్స్ మీట్, ప్రకృతి వైద్యం తదితర అంశాలపై సభలను నిర్వహించామని అన్నారు. ఆశ్రమం కో–ఆర్డినేటర్ సుగుణారావు అధ్యక్షతన జరిగినఈ సమావేశంలో సభ్యులు రాయలింగు, శైలజ, పిల్లలమర్రి వరప్రసాద్, భిక్కూలాల్, దయాసాగర్, బంగారి శంకర్, రమేష్‌బాబు, సబ్బన రాజేష్, యాకస్వామి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బూర్గంపహాడ్, ఫిబ్రవరి 24: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను బూర్గంపహాడ్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఎస్సై రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని తాళ్లగొమ్మూరు గ్రామ శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను ట్రాక్టర్‌లో లోడు చేసుకుని వెళ్తుండగా సారపాక వద్ద స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

ఉపాధ్యాయుడి 'ప్రతిభ'కు సన్మానం..!

చంద్రుగొండ, ఫిబ్రవరి 24: ఓ ఉపాధ్యాయుడి 'ప్రతిభ'ను ఐటీడీఏ పీవో గుర్తించారు, గుర్తుంచుకున్నారు. మండలంలోని అన్నారం తండా గిరిజన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఇటీవల ఐటీడీఏ పీవో రాహుల్ సందర్శించారు. 'ఉద్దీపకము' పుస్తకంలోని పాఠాన్ని విద్యార్థులకు బోధించడంలో అక్కడి ఉపాధ్యాయుడు చంద్రు బోధిస్తున్న తీరును గమనించారు. ఆయనలో ప్రతిభ ఉందని గుర్తించారు. పీవో ఆదేశంతో ఈ పాఠశాలను టీడీవో చంద్రమోహన్ సోమవారం సందర్శించారు. ఉపాధ్యాయుడు చంద్రుకు శాలువా కప్పి సన్మానించారు. చంద్రమోహన్ మాట్లాడుతూ... ''ఈ పాఠశాలను ఇటీవల ఐటీడీఏ పీవో సందర్శించారు. 'ఉద్దీపకము'లోని పాఠ్యాంశాలను చంద్రు ప్రతిభావంతంగా బోధించడాన్ని గుర్తించారు, గుర్తుంచుకున్నారు. పీవో ఆదేశాలతోనే పాఠశాలను సందర్శించాను, చంద్రును సన్మానించాను. అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులకు గుర్తింపు ఉంటుంది'' అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కబీర్‌దాస్, ఏహెచ్‌ఎస్ హెచ్‌ఎం చంద్రు తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేని డ్రైవర్లపై చర్యలు

ఆటో డ్రైవర్లకు లెర్నింగ్ లైసెన్స్ ఇప్పించిన ఎస్సై

కొత్తగూడెం ప్రగతి మైదాన్, ఫిబ్రవరి 24: డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే వారి(డ్రైవర్లు)పై చట్టపరమైన చర్యలు తప్పవని కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్సై కొండపర్తి నరేష్ కుమార్ హెచ్చరించారు. ఇలాంటి వారిని గుర్తించేందుకు ఆయన సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. లైసెన్స్ లేకుండా ఆటోలు నడుపుతున్న రామవరం, సూపర్ బజార్, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్ అడ్డాలకు చెందిన ఐదుగురు డ్రైవర్లను గుర్తించారు. వారికి జిల్లా రవాణా శాఖ అధికారి వెంకట రమణ ఆధ్వర్యంలో లెర్నింగ్ లైసెన్స్ ఇప్పించారు. డ్రైవర్లతో ఆయన మాట్లాడుతూ.. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

దమ్మపేట, ఫిబ్రవరి 24: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని అల్లిపల్లి శివారులో పేకాట శిబిరంపై ఎస్సై, సిబ్బంది కలిసి సోమవారం దాడి చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.5600, మూడు మోటార్ సైకిళ్లు, ఒక టాటా ఏస్ వ్యాన్ స్వాధీనపర్చుకున్నారు. శిబిరం నుంచి ముగ్గురు పరారయ్యారు. కేసును ఎస్సై సాయికిషోర్ రెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్వ్యూ, ప్రజెంటేషన్ స్కిల్స్‌పై శిక్షణ

పాల్వంచ, ఫిబ్రవరి 24: ఇంటర్వ్యూ, ప్రజెంటేషన్ స్కిల్స్‌పై స్థానిక అనుబోస్ మహిళా ఇంజినీరింగ్ కాలేజీ మూడవ సంవత్సరం విద్యార్థినులకు తెలంగాణ టాస్క్ ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు శిక్షణ తరగతులు జరిగాయి. టాస్క్ రిసోర్స్ పర్సన్ ఆంటోని శిక్షణ ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ రవి, అకడమిక్ డైరెక్టర్ ఎన్‌వీ సుబ్బారావు, చైర్మన్ భరత్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ సవరించాలి

మాట్లాడుతున్న ఏజే రమేష్

పాల్వంచ, ఫిబ్రవరి 24: కార్పొరేట్ శక్తులకు ఊతమిస్తున్న, కష్టజీవులకు ఏమాత్రం ఊరటనివ్వని కేంద్ర బడ్జెట్‌ను సవరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌పై స్థానిక మంచికంటి భవన్‌లో సోమవారం సీఐటీయూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. రమేష్ మాట్లాడుతూ.. సమాజ సంపదలో సృష్టికర్తలైన కార్మికులకు, వ్యవసాయ కూలీలకు, రైతులకు ఊరటనిచ్చే కొత్త పథకాలుగానీ/నిర్ణయాలుగానీ కేంద్ర బడ్జెట్‌లో లేవని విమర్శించారు. నాయకులు దొడ్డ రవికుమార్, తుల సీరాం, రహీం, నిరంజన్, క్రాంతి మాధవి, గుర్రం రాములు, మొగిలి, రాములు, గట్టయ్య, కృష్ణవేణి, పద్మ, అమల, అరుణ పాల్గొన్నారు.

విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి

కొత్తగూడెం గణేష్ టెంపుల్, ఫిబ్రవరి 24: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్యాం కోరారు. ఆయన సోమవారం కొత్తగూడెంలో సంఘం సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ.. స్కాలర్‌షిప్పులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు రఘు , కిరణ్, వెంకట్, అశోక్, మానస, ప్రమీల, అశ్విని, రాగిణి తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ నిర్వహణపై సమీక్ష

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 24: వచ్చే నెలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహణపై ఇల్లెందు ఏరియా సేవా అధ్యక్షురాలు వి.రమ సోమవారం వైసీవోఏ క్లబ్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. డీజీఎం (పర్సనల్) జీవీ మోహన్‌రావు, అధికారులు సాయి స్వరూప్, సెక్రటరీ సులక్షణ పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం రవాణా చేస్తే చర్యలు

కరకగూడెం, ఫిబ్రవరి 24: పేదలకు అందించే పీడీఎస్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని కరకగూడెం ఎస్‌ఐ రాజేందర్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని సీతారాంపురం గ్రామం వద్ద సోమవారం పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా కరకగూడెం గ్రామానికి చెందిన మహ్మద్ ఇమ్రాన్, ఇదే మండలంలోని పద్మాపురం గ్రామానికి చెందిన మహ్మద్ నోమాన్ అనే ఇద్దరు వ్యక్తులు వాహనంలో 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రవాణా చేస్తుండగా పోలీసులు పట్టుకుని వాహనాన్ని సీజ్ చేశారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్ డీలర్లు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని, పీడీఎస్ బియ్యం, అక్రమంగా కొనడం, అమ్మడం చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం పరిశీలన

చంద్రుగొండ, ఫిబ్రవరి 24: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రహమాన్ సోమవారం పరిశీలించారు. ఎస్సై శివరామకృష్ణ పాల్గొన్నారు.

నేడు ఏవో కార్యాలయం ముందు ధర్నా

టేకులపల్లి, ఫిబ్రవరి 24: అకాల వర్ష బాధిత రైతులను ఆదుకోవాలన్న డిమాండుతో మండల వ్యవసాయ శాఖ కార్యాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించనున్నట్లు ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు భూక్యా హర్జ్య చెప్పారు. దీనిని రైతులంతా జయప్రదం చేయాలని కోరారు. నాయకులు ఎట్టి నరసింహారావు, కల్తీ వెంకటేశ్వర్లు, డి.ప్రసాద్, బోడ మంగీలాల్, చింత లాలమ్మ, జయరాం తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

అశ్వారావుపేట, ఫిబ్రవరి 24: అనారోగ్యంతో బాధపడుతున్న బీఆర్‌ఎస్ నాయకుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు జూపల్లి రమణారావును సోమవారం పట్టణంలోని ఆయన నివాసంలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పరామర్శించారు. నాయకులు యూఎస్ ప్రకాశరావు, జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, మోహన్‌రెడ్డి, తాడేపల్లి రావి, సత్యవరపు సంపూర్ణ, ముత్తా సుమాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయించండి.. విజయం సాధించండి

అశ్వారావుపేట టౌన్, ఫిబ్రవరి 24: పదోతరగతి విద్యార్థులు పరీక్షల ఒత్తిడిని జయించి, విజయం సాధించాలని ఇంపాక్ట్ ట్రైనర్స్ ప్రసాద్, నవాబ్‌పాషా కోరారు. పట్టణంలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం, విశ్రాంత ఏఈ శెట్టిపల్లి కృష్ణార్జునరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం మోటివేషన్ తరగతులను స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో నిర్వహించారు. త్తిడిని జయిస్తే.. వజ్రంలా తయారవుతారని అన్నారు.

సీపీఐ పట్టణ మహాసభ

అశ్వారావుపేట టౌన్, ఫిబ్రవరి 24: సీపీఐ పట్టణ మహాసభ సోమవారం స్థానిక పామాయిల్ ఫ్యాక్టరీ ఎదురుగా జరిగింది. జెండాను ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ ఆవిష్కరించారు. 13 మందితో కార్యదర్శి వర్గం, మరికొందరితో కమిటీ ఎన్నికైంది.

ఆటోలకు నంబర్లు

ఇల్లెందు, ఫిబ్రవరి 24: పట్టణంలోని ఆటోలకు గుర్తింపు నంబర్, యజమాని అడ్రస్‌తో కూడిన కొత్త స్టిక్కర్లను పోలీసులు సోమవారం అంటించారు. దీనిని డీఎస్పీ చంద్రభాను ప్రారంభించారు. సీఐ సతరాయణ, ఎస్‌ఐలు సూర్య, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్యాసింజర్ ఆటోలకు టాప్ నంబర్లు

దమ్మపేట, ఫిబ్రవరి 24: మండలంలోని అన్ని ప్యాసింజర్ ఆటోలకు టాప్ నంబర్లను ఎస్సై సాయికిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం అంటించారు. ఆటో డ్రైవర్ల పూర్తి వివరాలు, చుట్టుపక్కల పోలీస్ స్టేషన్ల అధికారుల ఫోన్ నంబర్లు, షీ టీం ఫోన్ నంబర్లు కలిగిన పోస్టర్లను కూడా అంటించారు.

తునికాకు సేకరణకు వినతి

దమ్మపేట రూరల్, ఫిబ్రవరి 24: తునికాకు సేకరణ పనులు ప్రారంభించాలని కోరుతూ దమ్మపేట ఇన్‌చార్జ్ తహసీల్దార్ వాణికి సీపీఐ–ఎంఎల్ (మాస్‌లైన్) నాయకులు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. రాము తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నల్ మార్కుల మూల్యాంకనం

జూలూరుపాడు, ఫిబ్రవరి 24: స్థానిక జిల్లాపరిషత్ సెకండరీ, సెయింట్ ఆంటోనీస్, కేజీబీవీ పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల మూల్యాకనం జరుగుతున్నది. దీనిని సోమవారం స్పెషల్ మానిటరింగ్ టీం పరిశీలించింది.

'చెరువుల సరిహద్దులను గుర్తిస్తాం'

జూలూరుపాడు, ఫిబ్రవరి 24: మండలంలోని చెరువుల లోతట్టు ప్రాంతాలను, శిఖం భూములను రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల ఆధ్వర్యంలో సర్వే చేసి హద్దులను ఏర్పాటు చేస్తామని ఇరిగేషన్ ఏఈ మీనా తెలిపారు. మండంలోని ఎర్రచెరువు, జమ్మికుంట, లక్ష్మీదేవికుంట చెరువులను సోమవారం పరిశీలించారు.

కుల గణనపై ఫిర్యాదు

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): కుల గణనలో మున్నూరు కాపులకు అన్యాయం జరిగిందని ఆ సంఘం జిల్లా నాయకులు సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌కు 'ప్రజావాణి'లో ఫిర్యాదు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని కోరారు. వనమా రాఘవేందర్‌రావు, ఆళ్ల మురళి, ఎడవల్లి కృష్ణ, రంగా కిరణ్, కాపు సీతాలక్ష్మి, కాసుల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల సంక్షేమానికి నిధులు కేటాయించాలి

పాల్వంచ, ఫిబ్రవరి 24: రాష్ట్రంలోని దళితుల సంక్షేమానికి సరిపడినన్ని నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. దళిత హక్కుల పోరాట సమితి జిల్లా మహాసభ సోమవారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో జరిగింది. ముఖ్య అతిథి కూనంనేని మాట్లాడారు. పార్టీ నాయకులు సాబీర్ పాషా, ఏసురత్నం, మరుపాక అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

అశ్వాపురం, ఫిబ్రవరి 24: మల్లెలమడుగులో నిర్మిస్తున్న సీతారామాంజనేయ ఆలయ నిర్మాణ అభివృద్ధికి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రేసు రామిరెడ్డి రూ.50వేలు, మాజీ ఉపసర్పంచ్, నిర్మాణ కమిటీ కోశాధికారి చావా వీరరాఘవులు రూ.10వేలు, కోడి గంగన్న రూ.20,116, గొడుగు నాగేశ్వరరావు రూ.15,116, మానాది మల్లయ్య రూ.10,116, మానాది వెంకన్న రూ.10,116, చుంచు వెంకన్న రూ.5116, ఏర్పుల చిన్నవెంకన్న రూ.5116, రమనాతి వెంకటేశ్వరరావు, శ్రావణి రూ.5,116, గొడుగు శంకరమ్మ రూ.1116, కమిటీ సభ్యులకు అందజేశారు.

భద్రాద్రి రామయ్యకు ముత్తంగి అలంకరణ

స్వామివారికి నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, ఫిబ్రవరి 24: భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో సోమవారం అంతరాలయంలోని మూలవరులకు హైదరాబాద్‌కు చెందిన భక్తులు రూ.30 లక్షలతో తయారు చేయించి సమర్పించిన ముత్యాలు పొదిగిన ప్రత్యేక గొడుగులను అర్చకులు స్వామివారికి ధరింపచేశారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి బేడా మండపంలో నిత్యకల్యాణాన్ని జరిపారు.

సీతారామ పంప్ హౌస్ సందర్శించిన మంత్రి

పంప్ హౌస్ పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

ములకలపల్లి, ఫిబ్రవరి 24: మండలంలోని పూసుగూడెం పంచాయతీలోగల సీతారామ ప్రాజెక్ట్ పంప్ హౌస్, డెలివరీ పాయింట్, కెనాల్‌ను జిల్లా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం పరిశీలించారు. వచ్చే ఏడాది పంటలకు సరిపడా సాగునీటిని అందించాలని అధికారులతో చెప్పారు.

విజయవంతమైన రక్తదాన శిబిరం

రక్తదాన శిబిరంలో పాల్గొన్న లేడీస్‌క్లబ్ సభ్యులు, వైద్యసిబ్బంది

అశ్వాపురం, ఫిబ్రవరి 24: భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, గౌతమి స్ఫూర్తి ఫౌండేషన్ సంయుక్త సహకారంతో గౌతమి కాలనీ లేడీస్‌క్లబ్ సభ్యులు గౌతమినగర్ కాలనీ ఆసుపత్రిలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైందని అధ్యక్షురాలు ఓమా శర్మ తెలిపారు. 115 మంది రక్తదాతల నుంచి 115 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు పేర్కొన్నారు. ఈ రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా హెవీ వాటర్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ హెచ్‌కె.శర్మ, లేడీస్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ జి.స్వప్న, హెవీ వాటర్‌ప్లాంట్ డీజీఎం జి.శ్రీనివాస్ హాజరై శిబిరాన్ని ప్రారంభించగా క్లబ్ సభ్యులు మంజూష, చందన, దేవిత, అనిత, సుధ, గౌతమి స్ఫూర్తి ఫౌండేషన్ నుంచి ప్రదీప్, కె.సోమయ్య, శ్యాంసుందర్, వీవై.చారీతో పాటు భద్రాచలం ఆసుపత్రి వైద్యులు కిరణ్, చంద్రశేఖర్, అశ్వాపురం ప్రభుత్వ వైద్యురాలు సంకీర్తన, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెట్‌కు వాకర్స్ చేయూత

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 24: జాతీయ స్థాయి అథ్లెటిక్ క్రీడాకారుడు అపక సతీష్‌కు మణుగూరు నేతాజీ వాకర్స్ రూ.10 వేలు అందజేశారు. దుమ్ముగూడెం మండలం మారాయిగూడెనికి చెందిన సతీస్ రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొని ప్రతిభ కనబర్చారు. జనవరిలో కేరళలో నిర్వహించిన ఆలిండియా సీనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ 100, 200 మీటర్ల రన్నింగ్ విభాగంలో బంగారు పతకాలు, లాంగ్‌జంప్‌లో కాంస్య పతకం గెలుచుకున్నాడు. ప్రస్తుతం బెంగుళూరులో జరిగే ఏసియా జాతీయ అథ్లెటిక్ క్రీడల్లో పాల్గొనేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండగా ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో విజయభాస్కర్‌రెడ్డి, రావులపల్లి రాంమూర్తి, తాళ్లపల్లి యాదగిరి గౌడ్, సామ శ్రీనివాసరెడ్డి, కటకం సతీష్, వడ్లాణం రమేష్, మైత్రి శంకర్‌రెడ్డి, జొన్నలగడ్డ వెంకటేశ్వర్‌రావు, వాగబోయిన నాగేశ్వరరావు, కొరిమిల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పద్మశాలి మహాసభను జయప్రదం చేయండి

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 24: పద్మశాలి బంధువులందరూ ఏకం కావాలని, హైదరాబాద్‌లో మార్చి 9న జరిగే 17వ అఖిల భారత పద్మశాలి మహాసభను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచంద్రరావు పిలుపునిచ్చారు. శనివారం మణుగూరు పట్టణంలోని పద్మశాలి సంఘ భవనంలో జరిగిన ముఖ్య నాయకులు సమావేశంలో ఆయన మాట్లాడారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలకు అనుగుణంగా యువతరం బాపూజీ అడుగుజాడల్లో నడవాలని అన్నారు. కార్యక్రమంలో కోటా శ్రీనివాస్, ఉమామహేశ్వర రమేష్, రుద్ర నాగరాజు, గుండ్ల వెంకటేశ్వరరావు, సందా సత్యనారాయణ, చిలకా వెంకట్రామయ్య, కొరిమి బసవయ్య, వెంకన్న, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు

టేకులపల్లి, ఫిబ్రవరి 24: జామాయిల్ తోటను అక్రమంగా నరికిచ్చిన ఇద్దరిపై, నరికిన అతనిపై కేసు నమోదైంది. బోడు ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు.. ఏపీకి చెందిన మద్దిపాటి వెంకటేశ్వర్లుకు టేకులపల్లి మండలం సంపత్‌నగర్‌లో 20 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో జామాయిల్ తోట సాగు చేస్తున్నాడు. ఈ నెల 21న చింతోని చెలకకు చెందిన ఏలూరి కోటేశ్వరరావు, కొమరం చిట్టిబాబు కలిసి శంకర్ అనే కాంట్రాక్టర్ ద్వారా ఎకరం జామాయిల్ తోటను అక్రమంగా నరికించారు. వెంకటేశ్వర్లు ఫిర్యాదుతో కేసు నమోదైంది.

గంజాయి పట్టివేత

పాల్వంచ, ఫిబ్రవరి 24: స్థానిక నవభారత్ వద్ద గంజాయిని ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఆంధ్రా–ఒడిశా సరిహద్దు నుంచి హైదరాబాద్‌కు భద్రాచలం, పాల్వంచ మీదుగా ఎండు గంజాయి తరలిస్తున్నారని ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌కు సమాచారం అందింది. దీని ఇన్‌చార్జ్ సుంకరి రమేష్ ఆధ్వర్యంలో సిబ్బంది సోమవారం సాయంత్రం పాల్వంచలోని నవభారత్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. బైక్(ఏపీ 20 ఏపీ 4968)పై వెళ్తున్న మర్రి సాయి తేజ, కట్ల వివేక్‌రెడ్డి నుంచి ఐదు కేజీల ఎండు గంజాయి పట్టుకున్నారు. ఈ గంజాయిని ఆంధ్రా–ఒడిశా సరిహద్దు నుంచి హైదరాబాద్ తరలిస్తున్నట్లు వారిద్దరూ ఒప్పుకున్నారు. ఈ గంజాయి విలువ రూ.2 లక్షలు ఉంటుందని సీఐ సుంకర రమేష్ తెలిపారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుళ్లు కరీం, కానిస్టేబుళ్లు సుధీర్, వెంకటేష్, విజయ్, హనుమంతరావు, ఉపేందర్ పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఆరునెలల జైలు

భద్రాచలం, ఫిబ్రవరి 24: హత్యాయత్నం కేసులో నిందితుడికి ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ భద్రాచలం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ శివనాయక్ సోమవారం తీర్పునిచ్చారు. వివరాలిలా ఉన్నాయి.. పట్టణంలోని ఎస్‌ఆర్ కాలనీకి చెందిన బుయ్యని వినోద్ భద్రాచలం పోలీస్‌స్టేషన్‌లో తనపై హత్యాయత్నం చేసినట్లు దుమ్ముగూడెం మండలం రేగుబల్లికి చెందిన జెట్టి చరణ్‌పై ఫిర్యాదు చేశారు. భద్రాచలం పోలీసులు కేసు నమోదు చేసుకొని కోర్టులో చార్జిషీటు వేయగా విచారణ అనంతరం న్యాయమూర్తి శివనాయక్ సోమవారం తీర్పు వెలువరించారు. జెట్టి చరణ్‌పై నేరం రుజువు కావడంతో ఆరునెలల జైలు శిక్ష, రూ.1000 జరిమాన విధిస్తూ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ తీర్పునిచ్చారు. ఏపీపీ శ్రీనివాస్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ నర్సింహారావు ఉన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

టేకులపల్లి, ఫిబ్రవరి 24 : తాళం వేసిన ఇంట్లో పట్టపగలు చోరీ జరిగిన ఘటన రాజుతండాలో సోమవారం చోటు చేసుకుంది. టేకులపల్లి ఎస్సై సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన మెంతెన శేషగిరి, శ్వేత దంపతులు సోమవారం ఉదయం ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లారు. సాయంత్రం వచ్చి చూడగా ఇంటి వెనుకాల నుంచి మెష్ డోర్ పగులగొట్టి, తలుపు గడియతీసి ఉంది. ఇంట్లోని బీరువాను పరిశీలించగా.. అందులో ఉన్న రెండు తులాల బంగారం, రూ.70 వేల నగదు చోరీకి గురైనట్లు బాధితులు గుర్తించి ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు. క్లూస్ టీమ్‌ను పంపించి ఆధారాలు సేకరించినట్లు ఎస్సై వివరించారు.